అంగన్‌వాడీల్లో ఆధునిక బోధన

- ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు
- చిన్నారుల్లో మేధోశక్తిని పెంచేలా చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు చెబుతున్న టీచర్

రాజానగరం: ఒకప్పుడు ఉప్మా బడులుగా పిలువబడే అంగన్‌వాడీ కేంద్రాలు నేడు కార్పొరేట్ స్కూళ్లను మరిపించేరీతిలో చిన్నారులకు నర్సరీ విద్యను అందిస్తున్నాయి. తెలుగు, ఇంగ్లిష్ భాషలను నేర్చుకునేందుకు వీలుగా ఆధునిక విద్యా బోధనతో ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారి ఆకట్టుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇంతవరకూ అమలు జరిగిన మూస విద్యా విధానానికి స్వస్తి పలికి, చిన్నారులలో ఆలోచనలను రేకెత్తిస్తూ, మేధోశక్తిని పెంపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానానికి విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బోధనా పరికరాలు

మనిషి ఎదుగుదలకు బాల్యం పునాది వంటిది. వారికి బంగారు భవిష్యత్తును అందించాలంటే బాల్యంలోనే సరైన విద్య నేర్పించాలన్నదే ప్రభుత్వం ఆలోచన. భవిష్యత్తుకు అవసరమైన కార్యక్రమాలపై దృష్టిని మళ్లిస్తే ఇక జీవితంలో వెనుదిరిగే పని ఉండదని సీఎం జగన్ భావించడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన తీరే మారిపోయింది. అభివృద్ధి చెందిన దేశాలలో అమలు జరుగుతున్న విద్యా విధానాన్ని పరిశీలించడంతోపాటు విద్యారంగ నిపుణులతో సంప్రదింపులు చేసి, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా టీచర్లు చేసే బోధన విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు కిట్లను కూడా అందజేశారు. జిల్లాలోని 1,556 కేంద్రాలలో మూడు నుంచి ఆరేళ్ల వయసున్న 30,663 మంది చిన్నారులకు వీటిని అందజేశారు. రెయిమ్స్, నీతి కథలను తెలుగు, ఇంగ్లిష్ భాషలలో ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలు, కలర్ కార్డులు, బిల్డింగ్ బ్లాక్స్, ఫ్లాష్ కార్డులు, పోస్టర్లు, చార్టులు, లెర్నింగ్ కిట్లు వీటిలో ఉన్నాయి. అలాగే అక్షరాలతో పాటు అంకెలను, రంగులను, జంతువులను, పక్షులను వాటిని తేలిగ్గా గుర్తించి, జ్ఞాపకం ఉంచుకునే విధంగా బోధనా సామగ్రిని కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఆధునిక బోధనా పరికరాలను అందించడంతోనే సరిపోదు వాటిని వినియోగించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సరైన అవగాహన ఉంటేనే వాటి ప్రయోజనం చిన్నారులకు అందుతుందని భావించారు. దీనితో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బందికి అవసరమైన శిక్షణ తరగతులను మండలాల వారీగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా డిగ్రీలు చేసి, శిక్షణ పొందిన టీచర్లు ఇక్కడ ఉండరు కాబట్టి, ఉన్న వారికే నర్సరీ బోధనపై ఉన్నత స్థాయి శిక్షణ ఇచ్చారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం బోధనకు అభ్యసన కరదీపిక, పరిసరాల విజ్ఞానం, ఇంగ్లిష్ వర్కుబుక్, చిత్రలేఖనం పుస్తకాలను సరఫరా చేశారు. అలాగే బుద్ధిమాద్యం పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, తరచూ వైద్యసేవలు అందించే ఏర్పాట్లు కూడా చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషకాహారంతో పాటు బాలామృతం అందిస్తున్నారు.

ప్రయోజనకరం



చిన్నారులను బడికి సంసిద్ధులను చేయడానికి, వారి సంపూర్ణ అభివృద్ధికి, మేధస్సు పెంపునకు ప్రీ ప్రైమరీ స్కూళ్ల విద్యావిధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులలో మెదడు శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో వారికి అవగాహనతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. దీని ద్వారా భవిష్యత్తులో వారికి ఎన్నో ప్రయోజనాలుంటాయి. ఆట పాటలతో విద్యనేర్పడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధిని సాధిస్తారు.

– టి. నాగమణి, ఐసీడీఎస్ సీడీపీఓ, రాజానగరం

క్లుప్తంగా

చంద్రేడులో ఉపాధి గ్రామసభ


గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ వెంకటేశ్వర్లు

రంగంపేట: చంద్రేడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి అధ్యక్షతన మంగళవారం ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను చర్చించారు. చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు, పుంతరోడ్లు, సోక్ పిట్లు, రింగ్‌ట్రెంచ్‌లు, హార్టికల్చర్ తదితర పనులతో పాటు కొత్తగా 30 పనులను గుర్తించామని గ్రామసభలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంటిపూడి శేషారత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు జాస్తి సత్తిబాబు, కంటిపూడి జెమ్మీ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

డ్వామా పీడీ పర్యటన


కొత్తపల్లిలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జగదాంబ

గోకవరం: మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పి.జగదాంబ మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. గోకవరం, కృష్ణునిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. కొత్తపల్లిలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో పాల్గొని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనులను పర్యవేక్షించారు. వేతనదారులకు రూ.272 జీతం వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్ సుగుణ, వ్యవసాయాధికారి రాజరాజేశ్వరి ఆధ్వర్యాన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని, పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ పద్మాజ్యోతి, ఉపాధి ఏపీఓ శేష అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..


లబ్ధిదారులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మల్లవరంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలకు ఎవరైనా అర్హులుంటే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. గ్రామానికి చెందిన 38 మందికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని, తమ సమస్యను ఎమ్మెల్యేకి ఇటీవల వివరించగా, తక్షణమే స్పందించి, మంజూరు చేశారని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్ సమీపాన రూ.7 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే చంటిబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 22, 23 తేదీల్లో గైట్‌లో జాతీయ సదస్సు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబరు 22, 23 తేదీల్లో బహుళ క్రమశిక్షణా పరిశోధన –ఆవిష్కరణలు అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ని కళాశాల ఎండీ కె.శశికిరణ్ వర్మ మంగళవారం ఆవిష్కరించారు. విద్యావేత్తలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ఆధునిక సాంకేతిక మార్పులపై సమాచార మార్పిడికి ఈ మంచి వేదికవుతుందన్నారు. ఆసక్తి గల వారు తాము సమర్పించే ప్రతుల అబ్‌స్ట్రాక్ట్‌ని నవంబరు 4లోగాను, పూర్తి ప్రతులను డిసెంబరు 2 నాటికి సమర్పించాలన్నారు. వివరాలకు 99993 96738, 96523 42835ను సంప్రదించాలన్నారు.

భవానీ భక్తులకు వడిభిక్ష


భవానీ భక్తులకు వడిభిక్ష వడ్డిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజానగరం: భవానీ మాల ధరించి, దీక్షతో జాతీయ రహదారిపై విజయవాడకు నడిచి వెళ్లే భక్తులకు ఉదయం వేళలో ఐదు రోజుల పాటు వడిభిక్షను అందించే కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీ భరత్ రామ్ ప్రారంభించారు. దివాన్ చెరువు నుంచి నాలుగో బ్రిడ్జికి వెళ్లే మార్గంలో దీన్ని నిర్వహిస్తున్నారు. తేజ పురోహిత్ జైన్‌సింగ్ బృందం ఏటా భవాని భక్తులకు వడిభిక్ష నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాదిలో కూడా ఐదు రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సంకిస భవానీ ప్రియ, నొడగల సుధా, ఎన్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు భవనం ప్రారంభోత్సవం

బిక్కవోలు: పందలపాకలోని వెలంపేట నిర్మించిన బహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘ భవనాన్ని బుధవారం ప్రారంభిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించే మరో భవనం, మహిళా భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


వేంద్రలో తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి
- వేంద్రలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదపూడి: నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేంద్ర గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.17 లక్షలతో తాగునీటి ట్యాంక్, పైపు లైన్ ఆధునీకరణ పనులకు, అలాగే ఎంపీ నిధులు రూ.17.50 లక్షలతో నిర్మించే కళావేదికకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సుమారు రూ.15 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి ఏర్పాటు చేసి, నూతనంగా తాగునీరు ట్యాంక్‌లు, పైపులైన్ ఆధునీకరణ పనులు దాదాపు పూర్తవుతున్నాయన్నారు. ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీరు పూర్తిస్థాయిలో అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, గ్రామ సర్పంచి కోసూరి వాసు, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఏ.త్రిమూర్తులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, పైన సొసైటీ ప్రతినిధి పేపకాయల సూర్యనారాయణ (డీటీఎస్), పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

అన్నపూర్ణా నమోస్తుతే..

- ఘనంగా దసరా ఉత్సవాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


అన్నపూర్ణాదేవీగా చంద్రేడులోని కాత్యాయిని


రంగంపేటలోని ఉమా మహేశ్వరి అమ్మవారు

రంగంపేట: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రంగంపేట దేవీసెంటర్‌లోని ఉమా రామలింగేశ్వర ఆలయంలో ఉదయం అభిషేకాలు అనంతరం కలశస్థాపన, సహస్రనామ కుంకుమార్చన చేసి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అర్చకుడు నాగేంద్ర శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. దొంతమూరు మెయిన్‌రోడ్డులోని విజయ దుర్గాదేవి అమ్మవారి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈలకొలనులోని ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి పూజలు చేశారు.

108 రకాల ప్రసాదాలతో మహానివేదన

గోకవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీ చౌక్ కనకదుర్గమ్మ వారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు 108 రకాల ప్రసాదాలతో మహానివేదన చేశారు. అమ్మవారికి అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం మహానివేదన సమర్పించారు. వీరభద్రుని గద్దెలోని కనక దుర్గమ్మను ఆలయ కమిటీ ఆధ్వర్యాన పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో నాగులో రోజైన బుధవారం గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ, వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మ వార్లు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మధురపూడి: దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ మంగళవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దోసకాయలపల్లిలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దుర్గమ్మకు కుంకుమ పూజలు నిర్వహించారు. గాడాల, కాపవరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.


గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మకు సమర్పించిన 108 రకాల ప్రసాదాలతో మహానివేదన

చాగల్నాడు పంట కాలువకు మోక్షమెప్పుడు!

- సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ రాంబాబు
- సమస్యను పరిష్కరించాలని వినతి


జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: మండల పరిధిలోని పెదరాయవరం వద్ద అక్రమంగా పూడ్చివేసిన చాగల్నాడు పంట కాలువకు మోక్షం ఎప్పుడు కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ప్రశ్నించారు. మంగళవారం కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. నీటిపారుదల అంశం రాగానే రాంబాబు చాగల్నాడు ఎత్తిపోతల పథకం పంట కాలువను ఆరు నెలల క్రితం ఒక రైతు పూడ్చి వేశాడని, దీనివల్ల రంగంపేట మండల పరిధిలోని కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాలకు సాగునీరు అందక ఖరీఫ్ పంటను రైతులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా జోక్యం చేసుకుని ఈ విషయం తన దగ్గరకు వచ్చిందని, కాలువ కోసం భూమి ఇచ్చిన రైతుకు నష్టపరిహారం అందక ఇలా జరిగిందని, ఆ రైతుకు నష్టపరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీనిపై రాంబాబు మాట్లాడుతూ సదరు రైతు కావాలనే నష్టపరిహారం తీసుకోవడం లేదని, మిగిలిన రైతులను ఇబ్బంది పెట్టే ఆలోచనలో అతడు ఉన్నాడని కలెక్టర్‌కు వివరించారు. అందువల్ల ఆ రైతుకు అందాల్సిన నష్టపరిహారాన్ని కోర్టులో జమ చేసి వెంటనే కాలువను పునరుద్ధరించాలని రాంబాబు కోరారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చాగల్నాడు కాలువ సమస్యకు సంబంధించిన కొన్ని పత్రాలను కలెక్టర్‌కు అందించి, ఐదు గ్రామాలకు చెందిన ఐదువేల ఎకరాల సమస్య కాబట్టి వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఆదిరెడ్డికి ఏపీ ఫార్మా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆదిరెడ్డి

అనపర్తి: ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి ఏపీ ఫార్మా అవార్డు అందుకున్నారు. గుంటూరు మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఏపీ ఫార్మా అవార్డ్స్–2023 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ ఏఎస్ హరేంద్ర ప్రసాద్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆదిరెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.

ఇజ్రాయేల్ దాడులపై నిరసన

రాజానగరం: గాజాపై ఇజ్రాయేల్ చేస్తున్న సైనిక దాడులను తక్షణమే నిలుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాజానగరంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి తీర్మానాలను ఇజ్రాయిల్ ఆమోదించాలని, పాలస్తీనా సంపూర్ణ స్వాతంత్ర్య దేశం కోసం సాగే పోరాటాలను బలపర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపం నుంచి బస్టాండ్ వరకూ ప్రదర్శన సాగింది.

గోదావరి చాప్టర్ చైర్మన్‌గా పీఆర్కే



రాజానగరం: నేషనల్ ఇనిస్టిట్యూట్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం) గోదావరి చాప్టర్ చైర్మన్‌గా గైట్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పీఆర్‌కే రాజు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన చాప్టర్ నూతన కార్యవర్గ ఎన్నికలలో తనను చైర్మన్‌గా ఎన్నుకున్నారని డాక్టర్ రాజు తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణ జిల్లాల పరిధిలోకి వచ్చే ఈ చాప్టర్‌కి కార్యవర్గ ప్రతినిధుల పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది.

ఘనంగా బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ విద్యార్థినులు

రాజానగరం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగంగా ఉన్న బతుకమ్మ సంబరాలు తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కనువిందు చేశాయి. కళాశాల చైర్‌పర్సన్ కె.అనూషా రెడ్డి, ప్రిన్సిపాల్ వై.రాజశ్రీ రావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. సంప్రదాయ వస్త్రాలను ధరించి, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, ఆటపాటలతో కళాశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక సుగంధాలు వెదజల్లారు. విద్యార్థినులకు భిన్న సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియాజేయాలనే ఆలోచనతో కళాశాలలో విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించామని చైర్మన్ ఉపేంద్రరెడ్డి తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం


బూరుగుపూడి శిబిరంలో మందుల పంపిణీ


బిక్కవోలులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజీవ్


సీతానగరం వైద్యశిబిరంలో వైద్యులు, పార్టీ నాయకులు

పెదపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని వక్తలు అన్నారు. జి.మామిడాడలోని సచివాలయం 1లో సర్పంచ్ లంక మున్ని అధ్యక్షతన మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.విజయభాస్కర్ మాట్లాడుతూ వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య నిపుణులు రోజా, బి.సురేఖ, శ్యామల, శ్యామ్ కుమార్ నాయక్ తదితరులు సుమారు 417 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీపీ కేతా తులసి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, సచివాలయం కార్యదర్శి ఎస్.యశ్వంత్ పాల్గొన్నారు.

బిక్కవోలులో..

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలందరికీ మేలు జరుగుతోందని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాజీవ్ అన్నారు. ఆ గ్రామంలోని మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 650 మందికి పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు.

పేదల ఆరోగ్య రక్షణ కోసమే

రంగంపేట: పేదల ఆరోగ్య రక్షణ కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. ముకుందవరంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్లు షమ్మీకుమార్, గంగాధర్, అంజనీ శ్వేత, రవీనా ఆదిరాజు తదితరులు 641 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీటీసీ పూడి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్.రామచంద్రరావు, దాసరి వెంకటేశ్వర్లు, పందిరి ఆనంద్ పాల్గొన్నారు.

బూరుగుపూడిలో..

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి హైస్కూల్లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ మాట్లాడుతూ సెప్టెంబరు 30న ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నవంబర్ 3వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. మండలంలో 50 శాతం పూర్తయినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన శిబిరాల ద్వారా 6,599 మందికి వైద్యసేవలు అందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కోటేశ్వరరావు, పుణ్యశాంతి, లావణ్య, ప్రజ్ఞ, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకా రాజు, పిట్టా కృష్ణ, చొంగా వెంకన్న, ఏడిద పండు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన వైద్యశిబిరంలో 624 మందికి వైద్య సేవలు అందించారు. పీహెచ్‌సీ డాక్టర్లు రాజు, ఏసురాణి, మేఘన, స్పెషలిస్టులు పి.శివకుమార్ (పిల్లల వైద్యులు), జి.రజిత (జనరల్ సర్జన్), బి.సత్యప్రసాద్ (కంటి) రోగులకు వైద్యపరీక్షలు చేశారు. 21 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 77 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 68 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి త్వరలో కళ్లజోళ్లు అందించనున్నారు. గతంలో పరీక్షలు నిర్వహించిన 65 మందికి కళ్లజోళ్లు అందించారు. ఎంపీడీవో కె.రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీ వెన్నెల అప్పల నాయుడు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు మట్ట వసంతరావు, కోలా శ్రీను, సలాది వాసు, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, ఎంపీహెచ్‌ఎస్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ధాన్యం అమ్మే సమయంలో తప్పనిసరిగా రైతే బయోమెట్రిక్ వేయాలి అనే నిబంధన వల్ల భూయజమాని దూర ప్రాంతాల్లో ఉన్న సందర్భాల్లో కౌలు రైతులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రంలో అమ్ముకోవడానికి కొన్ని ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. ట్రాన్స్‌పోర్టు భారం, సమయం వృథా కాకుండా రైతుల గ్రామాలకు దగ్గరలోని రైస్ మిల్లులకు ట్యాగ్ చేసే విధంగా నిబంధనలు సవరించాలన్నారు. ఈ విషయాలను సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సంయుక్త కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని తెలిపారు.